# అసఫ్‌జాహీల పాలనలో తెలంగాణ

తెలంగాణాలో దాదాపు రెండు శతాబ్దాలకు పైగా అసఫ్‌జాహీ వంశస్థుల పాలన సాగింది. అయితే, వీరు కుతుబ్ షాహీ చక్రవర్తుల ప్రజారంజక పాలనను చేయలేకపోయారు. అందువల్ల ఆంగ్లేయులు పాలించిన బెంగాల్, మద్రాస్, బొంబాయి ప్రెసిడెన్సీ, ఇతర స్వదేశీ సంస్థానాలతో పోలిస్తే తెలంగాణా వెనుకపడింది. సాలార్‌జంగ్ సంస్కరణలు, చివరి నిజాం ఉస్మాన్ ఆలీఖాన్ కాలంలో జరిగిన అభివృద్ధి మాత్రమే ఈ ప్రాంతానికి సంబంధించి కారుచీకటిలో కాంతి రేఖలా కనిపిస్తుంది.

**సాంఘిక పరిస్థితులు:**

నిజాం రాష్ట్రం – ఆంధ్ర, కన్నడ, మహారాష్ట్రలతో బహు భాషారాష్ట్రంగా ఉండేది. తెలుగు వారు 50 శాతం వరకు ఉన్నప్పటికీ ఇక్కడ తెలుగు ఆదరణకు నోచుకోలేదు. పాలక వర్గానికి చెందిన ముస్లింలు పది శాతం, పాలితుల్లో హిందువులు 85 శాతం పైగా ఉండేవారు. అసఫ్‌జాహీలు ప్రతిభనే ప్రాతిపదికగా తీసుకునేవారు. దీంతో సహజంగానే అధిక శాతం జనాభా గల హిందువులకు ఎక్కువగా అధిక ఉద్యోగాలు వచ్చేవి. దీంతో తమను పాలకులు అలక్ష్యం చేశారని స్థానికులు అసంతృప్తి చెందారు. ఫలితంగా మీర్ మహ్మద్ ఆలీ కాలంలో 'ముల్కీ-నాన్ ముల్కీ' ఉద్యమం వచ్చింది.

అసఫ్ జాహీలు రాజ్యంలో సామాన్యుల స్థితి దుర్భరంగా ఉండేది. నిజాం నుంచి పటేల్, పట్వారీ, జాగీర్దార్, జమీందార్లు, దేశ్‌ముఖ్,పాండేలు ఇలా అందరూ ప్రజల్ని దోపిడీ చేసే వ్యవస్థ ఆనాడు ఏర్పడింది. అయితే మతాంతర వివాహాలు జరగడం ఆనాటి కాలానికి సంబంధించిన ఆదర్శనీయాంశం. మహబూబ్ ఆలీఖాన్ దీవాన్‌గా పని చేసిన మహారాజా కిషన్ ప్రసాద్ ముస్లిం స్త్రీలను వివాహమాడాడు. నిజాం ఆలీ కాలంలో హైదరాబాద్‌లోని బ్రిటీష్ రెసిడెంట్ జేమ్స్ పాట్రిక్ మీర్ ఆలీ వంశానికి చెందిన ఖైరున్నీసా బేగంను వివాహమాడాడు.

**ఆర్థిక పరిస్థితులు :**

ఆనాడు ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. అయితే రైతులు పరిస్థితి దయనీయంగా ఉండేది. పరిశ్రమల విస్తరణ కూడా తక్కువే. పరిశ్రమల అవసరాల్ని గుర్తించిన మొదటి సాలార్‌జంగ్ 1856లో చాదర్‌ఘాట్ దగ్గర దేశీయ పరిశ్రమల ప్రదర్శన ఏర్పాటు చేశాడు. ఉస్మాన్ ఆలీఖాన్ హయాంలో పరిశ్రమల ఏర్పాటు జరిగింది. గద్వాల్, ఔరంగాబాద్, సిద్ధిపేట, బీదర్, నిర్మల్‌ల్లో సిల్కు పరిశ్రమల స్థాపన జరిగింది. వరంగల్‌లో వస్త్ర పరిశ్రమల అభివృద్ధి చెందింది. సిర్పూర్ పేపర్ మిల్లు, బోధన్ చక్కెర ఫ్యాక్టరీ, వరంగల్‌లో అజంజాహీ వస్త్రాల మిల్లు, హైదరాబాద్‌లో చార్మినార్ సిగరెట్ ఫ్యాక్టరీ, దివాన్ బహదూర్ రాంగోపాల్ మిల్లు వంటివి వెలిశాయి.

కరువులు, వరదలు కూడా ఆనాటి ప్రజల ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్థం చేశాయి. 1777లో మూసీనదికి వరద వచ్చి హైదరాబాద్ అతలాకుతలం అయింది. నిజాం రాజ్యంలో రవాణా సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉండేవి. మహబూబ్ ఆలీఖాన్ పాలనలో మొదటి సాలార్‌జంగ్ 1878లో హైదరాబాద్-వాడి రైలు మార్గాన్ని పూర్తి చేయించాడు. అలాగే హైదరాబాద్-షోలాపూర్ మార్గం కూడా ఈయనే వేయించాడు. హైదరాబాద్ నుంచి మచిలీపట్నం, వరంగల్, కర్నూలు, నిజామాబాద్, నాగపూర్‌లకు బ్రిటీస్ రెసిడెంట్లు అనేక రోడ్లు వేయించారు. 1866లో నిజాం సర్కారు పబ్లిక్ వర్క్స్ శాఖను ఏర్పాటు చేసింది.

**సాలార్‌జంగ్ సంస్కరణలు :**

ఏ దీవానూ ప్రవేశపెట్టనన్ని సంస్కరణల్ని మొదటి సాలార్‌జంగ్ ప్రవేశపెట్టారు.

1) అనవసర ఖర్చు తగ్గించేందుకు ఎక్కువ వేతనం పొందుతున్న వేయి ఉన్నత ఉద్యోగాలు రద్దు
2) అనవసర అదనపు సైన్యం తొలగింపు (బ్రిటీష్ సైన్యం సికిందరాబాద్ వద్ద ఉంది కాబట్టి రక్షణకు ప్రమాదం లేదు)
3) బ్రిటీష్ పాలకులకు నిజాం ఇవ్వాల్సిన 50 లక్షల రూపాయల బాకీని రద్దు చేయించడం
4) నిజాం రాజ్యాన్ని 5 సుబాలుగా, 17 జిల్లాలుగా విభజించడం. సుబాకు సుబేదారును, జిల్లాకు తాలూకూదార్‌ను, తాలూకాకు తహసీల్దార్‌ను నియమించడం
5) 14 ప్రత్యేక కార్యాలయాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ కార్యక్రమాలు సవ్యంగా జరిగేలా చూడటం
6) రైతులకు, ప్రభుత్వానికి మధ్య ఉండే గుత్తదారులు అనే దళారీల తొలగింపు
7) మొత్తం రాజ్యాన్ని 17 రెవెన్యూ జిల్లాలుగా విభజించి అయిదు ప్రాంతీయ మండలాల్ని ఏర్పాటు చేయడం
8) భూమి శిస్తు నిర్ణయానికి పాత పద్ధతులకు స్వస్తి చెప్పి భూమి విస్తీర్ణం, సాగుబడి, సారం మొదలైన అంశాల ఆధారంగా కొత్త నిబంధనల రూపకల్పన
9) ధాన్యం బదులు నగదును శిస్తుగా నిర్ణయించడం
10) ప్రభుత్వ ఉద్యోగులకు భూముల్ని ఇచ్చే పద్ధతికి స్వస్తి చెప్పి నగదు రూపంలో వేతనాల చెల్లింపు
11) ముగ్గురు సభ్యులతో రెవెన్యూ బోర్డు ఏర్పాటు
12) మొత్తం 17 జిల్లాల్లో జిల్లాకు ఒక పోలీసు సూపరింటెండెంట్ నియామకం
13) 1876లో పోలీసు శాఖను రెవెన్యూ శాఖ నుంచి వేరు చేయడం
14) పాశ్చాత్య విద్యా వ్యాప్తికి 1855లో సాలార్ దారుల్ ఉల్మ్ అనే ఉన్నత అనే ఉన్నత పాఠశాల ఏర్పాటు

SAKSHI

15) 1870లో సిటీ హైస్కూల్, 1872లో చాదర్‌ఘాట్ హైస్కూల్ ఏర్పాటు

16) నిజాం ప్రభువుల పిల్లల కోసం 1873లో మదర్సా ఆలియా అనే పాఠశాల, రాజ కుటుంబాల పిల్లల కోసం ఐజా విద్యాలయం ఏర్పాటు చేయడం

17) 1870లో ఇంజినీరింగ్ విద్యాలయం ఏర్పాటు

18) న్యాయ వ్యవస్థ పటిష్టతకు అప్పీలు న్యాయస్థానం ఏర్పాటు, అదాలత్-ఇ-పాదు షాహి (ఉన్నత న్యాయస్థానం) ఏర్పాటు

19) ఉన్నత నాయస్థానానికి ప్రధాన న్యాయమూర్తి, నలుగురు న్యాయ మూర్తుల్ని నియమించడం

20) రాజధాని, జిల్లాల్లో మీర్ ఆదిల్, మున్సిఫ్ అనే న్యాయాధికారుల్ని నియమించడం

21) శిక్షల కాఠిన్యతను తగ్గించడంలో భాగంగా కాళ్లు చేతులు నరికే శిక్షావిధానాన్ని రద్దు చేయడం

22) ఉత్తర భారతం నుంచి పలువురు ముస్లిం మేధావుల్ని, కాయస్థ మేధావుల్ని పిలిపించి ఉద్యోగాలిప్పించడం. సయ్యద్ బిల్‌గ్రామి, సయ్యద్ మెహ్దీన్ ఆలీ, అఘోరనాథ ఛటోపాధ్యాయ, రుద్ర, రామ చంద్ర పిళ్లై మొదలైన వారు సాలార్‌జంగ్ ఆహ్వానం మేరకు హైద రాబాద్ వచ్చిన వారే!

ఇలా హైదరాబాద్ నగరానికి కాస్మోపాలిటన్ (బహుసాంస్కృతిక) స్వభావం అందించిన ఘనత సాలార్‌జంగ్‌కు దక్కింది.

SAKSHI

# తెలంగాణాలో సామాజిక సాంస్కృతిక చైతన్యం

1948లో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావడానికి దాదాపు వందేళ్లకు ముందే తెలంగాణా ప్రాంతంలో సామాజిక సాంస్కృతిక చైతన్యం ఊపిరిపోసుకుంది. ప్రగతి నిరోధకమైన నిజాం పాలన ప్రభావం వల్లనే తెలంగాణా ప్రజలు స్వాతంత్ర్య పోరాటం వైపు, సాంస్కృతిక చైతన్యం వైపు అడుగులు వేశారు.

నిజాం కాలంలో భూస్వామ్య రీతిలో సంస్థానం ఖాల్సా, సర్ఫ్-ఇ-ఖాస్, పైగా, జాగీర్ అనే నాలుగు విభాగాలుగా ఉండేవి. 58 శాతం భూమి ఖాల్సాకు చెంది నేరుగా ప్రభుత్వ పాలన కింద ఉండేది. మిగిలిన మూడు విభాగాలకు వరుసగా నిజాం, పైగా సర్దార్, జాగీర్దార్ (జమీందార్) అధికారాలు చలాయించేవారు. వీరు ఆయా ప్రాంతాల్ని తమ స్వంత ఆస్తులుగా పరిగణించి స్వార్థపూరితంగా ప్రవర్తించేవారు. ఇక గ్రామాల్లో మత్తేదారులు లేదా పత్తేదారులు అనే భూస్వాముల అరాచకాలు కొనసాగేవి. గ్రామాల్లో బఘేలా, వెట్టిచాకిరి వంటి బానిసత్వ పద్ధతులు ఉండేవి.

వీటికి తోడు – విద్యారంగాన్ని నిజాం ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ప్రభుత్వం విద్యాలయాల్ని ఏర్పాటు చేసేది కాదు. ప్రజలు స్వచ్ఛందంగా పాఠశాలల్ని ఏర్పరచుకోడానికి అనుమతిచ్చేది కాదు. వ్యాయామశాలల ఏర్పాటుకు కూడా ఎన్నో ప్రతిబంధకాల్ని సృష్టించేది. అఖాదా అంటే వ్యాయామశాలను ఏర్పరచుకోవాలంటే కలెక్టర్ లేదా కొత్వాల్ (పోలీస్ కమిషనర్) నుంచి అనుమతి పొందాలి. అనుమతి లేకుండా నెలకొల్పితే 500 రూపాయలు వరకు జరిమానా విధించేది.

ఇలాంటి నిరంకుశ పాలనతో విసిగిపోయిన తెలంగాణా ప్రజలు వివిధ ప్రభావాలతో చైతన్యం వైపు అడుగులు వేశారు. ఈ చైతన్యానికి నాందీ సంఘటనగా చాందా రైల్వే ఆందోళనను చెప్పవచ్చు. ఈ ఉద్యమం 1883లో జరిగింది. దీనికి అఘోరనాథ ఛటోపాధ్యాయ, ముల్లా అబ్దుల్ కయూమ్, దస్తూర్ అవుసగి హోషాంగ్ వంటి వారు నాయకత్వం వహించారు. 1885లో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించినపుడు కాంగ్రెస్‌లో హైదరాబాద్ సంస్థానం నుంచి చేరిన మొదటి ముస్లిం నాయకుడు అబ్దుల్ ఖయూమ్.

ఏ ప్రాంతంలోనైనా, ఏ కాలంలోనైనా ప్రజా చైతన్యానికి ప్రేరకశక్తులుగా పత్రికలు దోహదపడతాయి. తెలంగాణాలో చైతన్యానికి కూడా ప్రతికలు ఉపకరించాయి. హైదరాబాద్ రికార్డ్ అనే పత్రిక బ్రిటీష్ రెసిడెంట్‌ను 'స్థానిక సీజరు' అని విమర్శించింది. దీంతో నిజాం ప్రభుత్వం 1892లో ఆ పత్రికను నిలిపివేసింది. దీన్ని షాకత్-ఉల్-ఇస్లాం అనే పత్రిక హలాకూ ఖానీ ఉత్తర్వులుగా పేర్కొంది. హలాకూ ఖానీ అంటే మంగోల్ తెగకు చెందిన నిరంకుశ పాలకుడు. అప్పట్లో హిందూ పత్రికకు హైదారబాద్ విలేఖరిగా రామచంద్ర పిళ్లై పని చేశారు.

తెలంగాణాలో తెలుగు పత్రికల కంటే ఉర్దూ పత్రికలే ఎక్కువ. పత్రిక పేరులో 'ఆంధ్ర' అనే పదం కూడా ఉండేందుకు ప్రభుత్వం అంగీకరించేది కాదు. అందుకే సురవరం ప్రతాపరెడ్డి 'గోల్కొండ' పేరుతో పత్రికను నడిపారు. తెలంగాణాలో మొట్టమొదటి తెలుగు పత్రిక 1912లో ప్రారంభమైంది. ఇది మహబూబ్‌నగర్ జిల్లాలోని మారుమూల గ్రామం నుంచి వెలువడింది. పత్రిక పేరు తెలియనప్పటికీ శ్రీనివాస శర్మ అనే వ్యక్తి ఈ పత్రిక నడిపారు.

తెలంగాణాలో ఆంధ్రమాత, తెలుగు పత్రిక, ఆంధ్రాభ్యుదయం, శైవ ప్రచారిణి, శైవమణి, తెలంగాణా, సందేశం, ఆంధ్రకేసరి, తరుణి, శోభ, దివ్యవాణి, విభూతి, తెలుగుతల్లి, దక్కన్ కేసరి, ఆది హిందూ పత్రిక, సుజాత, గోల్కొండ, భాగ్యనగర్, నేడు మొదలైన పత్రికలు వెలిశాయి. రాజా మురళీమనోహర్ అధ్యక్షతన హిందూ సోషల్ క్లబ్ ఏర్పడింది. దీని ఉపాధ్యక్షుడు కృష్ణ అయ్యంగార్. అలాగే ఆ రోజుల్లో వాక్ స్వాతంత్ర్యంపై నిజాం ప్రభుత్వం ఎంత నిర్దాక్షిణ్యంగా ఉండేదో బారిష్టరు రుద్ర సంఘటనతో స్పష్టమైంది.

బారిష్టర్ రుద్ర ఉత్తర భారతదేశం నుంచి హైదరాబాద్ సంస్థానానికి వచ్చిన వ్యక్తి. ఆయన విజ్ఞాన సంపత్తిని చూసి నిజాం ప్రభుత్వం, అనేక మంది జమీందార్లు ఆయన్ని అక్కున చేర్చుకున్నారు. ఒక సందర్భంలో ఆయన నిజాం ప్రభుత్వాన్ని విమర్శిస్తూ 'పయనీర్' పత్రికలో వ్యాసాలు రాయడంతో రుద్రపై ఆంక్షలు ప్రారంభమయ్యాయి. చివరికు విసుగెత్తిన బారిష్టర్ రుద్ర హైదరాబాద్ విడిచిపెట్టి వెళ్లిపోయాడు.

1892లో హైదరాబాద్ ఆర్యసమాజ్ శాఖ ఏర్పాటైంది. నిత్యానంద బ్రహ్మచారి, విశ్వానంద సరస్వతి తదితరులు దీనికి కారకులు. ప్రభుత్వం వీరిని నానా ఇబ్బందులకు గురిం చేసింది. 1895 నుంచి హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అలాగే, 1906లో పండిత కేశరావు కోరాట్కర్, వామనరావు చంద్రనాయక్, గణపతిరావు హార్డీకేర్ వంటి వారు హైదరాబాద్‌లో వివేకవర్ధిని పాఠశాల ఏర్పాటు చేశారు.

ఆ కాలంలో తెలంగాణా ప్రజల్లో చైతన్యాన్ని తీసుకురావడానికి వివిధ సాంస్కృతిక సంస్థలు రూపొందాయి. కొమర్రాజు లక్ష్మణరావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యదేవర కాళేశ్వరరావు తదితరులు తెలంగాణా తెలుగు వారితో సాంస్కృతిక సంబంధాల్ని ఏర్పరచుకున్నారు. మునగాల రాజా నాయని వెంకట రంగారావు వీరికి వెన్నుదన్నుగా నిలిచారు. కొమర్రాజు ఈ రాజాగారి వద్దే దీవాన్‌గా ఉండేవారు.

రావిచెట్టు రంగారావు, కొమర్రాజు లక్ష్మణరావు హైదరాబాద్‌లో మొట్టమొదటి గ్రంథాలయం 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం'ను 1901లో స్థాపించారు. వీరే 1906లో 'విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి'ని స్థాపించారు. తెలుగులో వైజ్ఞానిక గ్రంథాల్ని ప్రచురించడం ఈ

SAKSHI

మండలి లక్ష్యం. నిజాం ప్రభుత్వ ఆంక్షల కారణంగా 1908లో ఈ మండలిని మద్రాస్‌కు తరలించాల్సి వచ్చింది. 1904లో హనుమకొండలో రాజరాజ నరేంద్ర ఆంధ్ర భాషానిలయం, 1905లో సికిందరాబాద్‌లో ఆంధ్ర సంవర్ధినీ గ్రంథాలయం ఏర్పడ్డాయి.

దేవులపల్లి రామానుజరావు 'ఆంధ్ర సారస్వత పరిషత్తు', కాళోజీ 'వైతాళిక సమితి', రావి నారాయణరెడ్డి 'నవ్య సాహితీ', దాశరథి 'తెలంగాణా రచయితల సంఘం' వంటి సాహిత్య సమితులు; చిలుకూరి వీరభద్రరావు 'ఆంధ్రుల చరిత్ర', సురవరం ప్రతాపరెడ్డి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర', ఖండవల్లి లక్ష్మీరంజనం 'ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి', మొదలైన గ్రంథాలు వంటివి తెలంగాణా ప్రజల్లో సాంస్కృతిక జాగృతికి దోహదపడ్డాయి. గ్రంథాలయోద్యమంలో భాగంగా ద్వితీయ గ్రంథాలయ మహాసభ 1929లో సూర్యాపేటలో జరిగింది.

రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేని భగవన్నామ సంకీర్తన భజన మండళ్లపై కూడా అప్పటి నిజాం సర్కారు విరుచుకుపడింది. చిన్నకిష్టయ్య అనే ప్లీడరు, శేషగిరిరావు అనే కాంట్రాక్టర్ కలసి మహబూబ్‌నగర్‌లో ఒక భజన కూటాన్ని ఏర్పరిచారు. దీన్ని ప్రభుత్వం రద్దు చేయించింది. 1311 ఫసలీ 46 ఫర్మానా ప్రకారం ప్రభుత్వ అనుమతి లేకుండా సంస్థానంలో ఎక్కడా ఆరాధనా మందిరాన్ని నెలకొల్పకూడదని నిజాం ప్రభుత్వం పేర్కొంది.

1915లో మీర్ అక్బర్ అలీ, మీర్జా మహ్మద్ బేగ్, అబ్దుల్ బాసిత్, మౌల్వీ మహ్మద్ ముర్తుజా, అక్బర్ సాజిర్ వంటివారు హైదరాబాద్‌లో ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్సును ఏర్పాటు చేశారు. వీరిలో మీర్ అక్బర్ అలీ అనే వ్యక్తి సహీషా అనే ఉర్దూ దినపత్రిక సంపాదకుడు. ఈ కాన్ఫరెన్స్ కృషి ఫలితంగా 1919, ఆగస్టు 28న ఉస్మానియా విశ్వవిద్యాలయం రూపుదిద్దుకుంది.

హ్యూమానిటేరియన్ లీగ్‌ను బాలముకుంద్, లాల్‌జీ మేఘ్‌జీ, భాగ్యరెడ్డి వర్మ తదితరులు స్థాపించారు. అలాగే కేశవరావు కోరాట్కర్, వామన్ నాయక్ 1915లో హైదరాబాద్ సోషల్ సర్వీస్ లీగ్‌ను స్థాపించారు. వీరే హైదరాబాద్ స్టేట్ రిఫార్మ్స్ అసోసియేషన్ స్థాపించారు. సంస్థాన ప్రజల రాజకీయ హక్కుల కోసం పోరాడటం ఈ సంస్థ ధ్యేయం.

SAKSHI

# తెలంగాణలో సామాజిక చైతన్యం

అసఫ్‌జాహీ వంశంలో ఏడో నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ నిజాం సంస్థానం తూర్పు కోస్తా నుంచి పశ్చిమతీరం వరకు విస్తరించింది. దక్కన్ పీఠభూమిలో నిజాం సంస్థానం సుమారు 86,698 చదరపు మైళ్ల మేర ఉండేది. జనాభా సుమారు కోటి 70 లక్షలవరకూ ఉండేది. మొత్తం 17 జిల్లాల్లో .. 9 జిల్లాల్లో అధికంగా తెలుగు, 5 జిల్లాల్లో మరాఠీ, 3 జిల్లాల్లో కన్నడ మాట్లాడే ప్రజలుండేవారు. తెలుగు మాట్లాడే ప్రజలు నివసించే జిల్లాలను తెలంగాణ అని, మరాఠీ మాట్లాడే జిల్లాలన్నింటినీ కలిపి 'మరాఠ్వాడ', కన్నడం మాట్లాడే జిల్లాలను కర్ణాటక ప్రాంతమని వ్యవహరిస్తుండేవారు. మొత్తం జనాభాలో ముస్లింల సంఖ్య 15 శాతం కంటే తక్కువ. భారతదేశంలోని 565 సంస్థానాల్లో నిజాం సంస్థానం అతిపెద్దది. ఇందులో మొత్తం గ్రామాలు 21,697. నూటికి 12 మందికి వాడుక భాషైన ఉర్దూను రాజభాషగా ప్రవేశపెట్టాడు నిజాం. దీనిని అన్ని స్థాయిల్లో పరిపాలనా భాషగా గుర్తించారు. హైదరాబాద్ నవాబ్ మధ్యయుగ జమిందారీ విధానాన్ని, మొఘలు సామ్రాజ్య అవశేష పరిపాలనా విధానాన్ని సంస్థానంలో ప్రవేశపెట్టాడు. 'రాజు దైవాంశ సంభూతుడనే' సిద్ధాంతాన్ని ప్రచారంలోకి తెచ్చాడు. హైదరాబాద్ రాష్ట్ర సంస్థానాన్ని సర్వస్వతంత్ర, స్వయం ప్రతిపత్తి గల ముస్లిం రాజ్యంగా చేయాలని కలలు కన్నాడు. కానీ నిజాం కల నెరవేరలేదు.

సంస్థానంలో 'పాయిగాలు' (రాజబంధువులు) సంస్థానాధిపతులు, 'జాగీరుదారుల' నిరంకుశ పరిపాలనలో ప్రజల బాధలు వర్ణణాతీతం. ఈ నిరంకుశాధికారులు నియమించిన న్యాయాధిపతులు, రెవెన్యూ, పోలీసు అధికారులు నిరంకుశ పాలన సాగించేవారు. జాగీరుదార్లు, సంస్థానాధిపతులు తమ పాలన కింద ఉన్న ప్రాంతాలకు వెళ్లినపుడు జాగీరు, రైతాంగం వారికి 'నజరానా' (ముడుపులు) చెల్లించుకోవాల్సి వచ్చేది. వారి ఇళ్లలో ఏ శుభకార్యాలు జరిగినా ముడుపులు, కానుకల రూపంలో సమర్పించుకోవాల్సిందే! చేతి వృత్తుల వారి నుంచి వృత్తి పన్ను, పద్మశాలీల నుంచి మగ్గం పన్ను జాగీరుదార్ల జేబుల్లోకి వెళ్లేది. ఏడాది పొడవునా గ్రామాల నుంచి చాకలి, మంగలి, కుమ్మరి, తదితర వృత్తి పనులు చేసుకొనేవారు వంతుల వారీగా వెట్టిచాకిరీ చేయాల్సిందే. సంస్థానంలో వ్యవసాయం కింద ఉన్న భూమి 5 కోట్ల 30 లక్షల ఎకరాలు. అందులో 3 కోట్ల భూమిశిస్తు ప్రభుత్వానికి చెల్లించేవారు. దీన్నే దివానీ లేదా ఖల్సా ప్రాంతంగా పరిగణించేవారు. కోటీ 50 లక్షల ఎకరాల భూమి జాగీరుదార్ల ఆధీనంలో ఉండేది. పదిశాతం భూమి నిజాం 'సొంత ఆస్తి'గా ఉండేది. దీన్నే 'సర్ఫ్‌ఖాస్' ప్రాంతంగా పిలిచేవారు.

### వెట్టిచాకిరి...

ఎలాంటి ప్రతిఫలం ఇవ్వకుండా, నిర్బంధంగా చేయించుకునే పనులను వెట్టి చాకిరీ అంటారు. గ్రామాలకు రెవెన్యూ, అటవీ, పోలీసు, మద్యపాన తదితర శాఖల అధికారులు వచ్చినపుడు వృత్తి పనులు చేసుకొనే పన్నెండు కులాల వారు అధికారులకు రాత్రింబవళ్లు సేవలు చేయాలి. చాకలి. మంగలి, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, తమ్మలి, హరిజన, బేగరి (గుర్రాలకు మాలీసు, పాకీపని చేసేవారు) మచుకూర (మోతాదు), నీరడి (నీరు తెచ్చేవారు) మొదలైనవారు అధికారులు గ్రామంలో ఉన్నన్ని రోజులు వెట్టిచాకిరీ చేయాలి.

తెలంగాణలోని ప్రతి గ్రామంలో దేశముఖ్, దేశపాండ్య, బంజరుదార్, ముఖ్తాదార్, ఇనాందార్, గ్రామాధికార్లు, అంతులేని దౌర్జన్యకాండను సాగించేవారు.

### వేధింపులు...

గ్రామాలకు ప్రభుత్వ ఉద్యోగులు, జాగీరు ఉద్యోగులు వచ్చినపుడు, చిల్లర దుకాణాలు పెట్టుకొని జీవించే వైశ్యులు అధికారులకు కావలసిన సరుకులను ఉచితంగా ఇవ్వాలి. బియ్యం, మసాలా దినుసులు, నూనె, నెయ్యి, పప్పు, చింతపండు, బీడీలు, చుట్టలు, సబ్బులు తదితర వస్తు సామగ్రిని ఉచితంగా సమర్పించుకోవాలి. అధికారుల వేధింపులు తట్టుకోలేక నిరాశ, నిస్పృహలతో ప్రజలు కుమిలిపోయేవారు. నోరు మెదపకుండా, పనులు చేసిపెట్టే మధ్యయుగాల నాటి 'బానిసత్వం ఆనాటి తెలంగాణలో ప్రజల్లో ప్రస్ఫుటంగా కనిపించేది. 'ప్రతి పౌరుడూ కొంత మొత్తాన్ని పన్ను రూపంగా చెల్లించాలని ముందుగానే నిర్ణయించేవారు. పేద-ధనిక, స్త్రీ-పురుష భేదం లేకుండా ప్రజలపై అత్యాచారాలు జరిగేవి. వారి చెవులకు బరువులను కట్టి, వెల్లకిలా పడుకోబెట్టి ఛాతీలపై రాళ్లు మోపేవారు. 'బాధితుల మొరను నిజాం ప్రభుత్వాధికారులు వినిపించుకునే కాదు. పాశవిక వైఖరి ప్రతి అధికారిలోనూ కనిపించేది' అని నిజాం నిరంకుశ పాలనకూ, ఆయన జాగీర్దార్ల అమానుష దమనరీతికి సాక్షి అయన 'సర్ జాన్ మాల్కోమ్' తన పుస్తకంలో రాశాడు. పై వాక్యాలు ఆనాటి తెలంగాణ ప్రజల బాధలకు అద్దం పడుతుంది.

ఈ నేపథ్యంలో తెలంగాణలో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక చైతన్యం గురించి సంక్షిప్తంగా తెలుసుకుందాం.

### తెలంగాణలో రాజకీయ చైతన్యం..

నిజాం ప్రభుత్వం వారి చాందా రైల్వే పథకానికి సంబంధించి 1883లో సాగిన ప్రజాందోళన హైదరాబాద్ సంస్థానంలో ప్రజాభిమతం

SAKSHI

సమీకరణకు నాంది పలికింది. హైదరాబాద్ నుంచి 'వాడి' వరకున్న రైల్వే స్టేషన్లనన్నింటినీ ఒక బ్రిటిష్ కంపెనీకి అప్పగించారు. ఆ కంపెనీ వారు రైల్వే మార్గాన్ని వరంగల్ వరకూ, అక్కడి నుంచి భద్రాచలం, ఉత్తరాన 'చాందా' వరకూ విస్తరించడం ఈ పథకంలోని ప్రధానాంశాలు. ఈ పథకం వల్ల హైదరాబాద్ సంస్థాన ప్రజల ప్రయోజనాలకు భంగం వాటిల్లుతుందని అప్పట్లో సరోజినీ నాయుడు తండ్రి అఘోరనాథ ఛటోపాధ్యాయ నాయకత్వంలో ఆందోళన చేశారు. ఇది నిజాంకు రుచించలేదు. ప్రభుత్వ విధానాలను ప్రజలు ప్రశ్నించే సాహసం చేస్తే అది ఎంత దూరమైనా వెళ్లొచ్చని అనుమానించాడు. అఘోరనాథ ఛటోపాధ్యాయుడిని పదవి నుంచి తొలగించి, హైదరాబాద్ నగరం నుంచి బహిష్కరించారు. సంస్థానం నుంచి బహిష్కృతుడైన మొట్టమొదటి జాతీయ నాయకుడు ఆయనే! అప్పటి నుంచి అసమ్మతిని వ్యక్తం చేసే నాయకులు ఎంతటివారైనా సరే రాష్ట్రం నుంచి బహిష్కరించడం మొదలైంది.

1885లో భారత జాతీయ కాంగ్రెస్‌ను స్థాపించారు. హైదరాబాద్ నుంచి మొట్టమొదటి ముస్లిం నాయకుడు ముల్లా అబ్దుల్ ఖయ్యూమ్, డాక్టర్ అఘోరనాథ ఛటోపాధ్యాయ, రామచంద్ర పిళ్లై జాతీయ కాంగ్రెస్‌లో సభ్యులుగా చేరిన హైదరాబాద్ సంస్థాన ప్రముఖులు తెలంగాణ ప్రజల్లో జాతీయభావ బీజాలు నాటారు.

### జాతీయ పత్రికా రంగం..

జాతీయ భావాలతో హైదరాబాద్ నుంచి అనేక పత్రికలు 1900లోనే ప్రారంభమయ్యాయి. ఆంగ్లంలో హైదరాబాద్ టెలిగ్రాఫ్, దక్కన్ స్టాండర్డ్, దక్కన్ టైమ్స్, హైదరాబాద్ రికార్డ్, ది దక్కన్ మెయిల్, ది దక్కన్ బడ్జెట్, హైదరాబాద్ క్రానికల్ ప్రచురితమయ్యాయి. మరాఠీలో గుల్బర్గా సమాచార్, నిజాం వైభవ్ భాగేశ్వర్, శ్రీ భాగేశ్వర విజయ, చంపావతీ పత్రికలు వచ్చాయి. తెలుగులో దినపత్రిక 'దినవార్తామాన' విడుదలయ్యేది. ఉర్దూ భాషలో 'షౌకతుల్ ఇస్లాం', 'హజార్ దాస్తాన్' అనే దినపత్రికల ప్రచురణ జరిగేది. హైదరాబాద్ రెసిడెంట్‌ను 'స్థానిక సీజర్'గా విమర్శించినందుకు హైదరాబాద్ రికార్డ్ పత్రికను బ్రిటిష్ రెసిడెన్సీ అనేక నష్టాలకు గురిచేసింది. చివరికి 1892లో ఈ పత్రిక ప్రచురణ ఆగిపోయింది. నిజాం ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛ మీద ఎన్నో నిర్బంధాలు విధిస్తూ ఫర్మానాలను జారీ చేసింది.

### ప్రాక్టీస్ ప్రశ్నలు

1. **సర్ఫ్‌ఖాస్ భూములంటే?**
   ఎ) దివానీ భూములు　బి) ఖల్సా భూములు
   సి) నిజాం సొంత ఖర్చులకు కేటాయించిన భూమి
   డి) జాగీరుదార్ల భూమి
2. **హైదరాబాద్ సంస్థానం నుంచి చాందా రైల్వే పథకానికి వ్యతిరేకంగా పోరాడిన ఫలితంగా మొట్టమొదట బహిష్కృతుడైన నాయకుడెవరు?**
   ఎ) రామచంద్ర పిళ్లై　బి) ముల్లా అబ్దుల్లా ఖయ్యూమ్
   సి) సరోజినీ నాయుడు
   డి) డాక్టర్ అఘోరనాథ ఛటోపాధ్యాయ
3. **1901లో హైదరాబాదులో 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం 'గ్రంథాలయాన్ని' స్థాపించింది?**
   ఎ) ముట్నూరి కృష్ణారావు
   బి) కొమర్రాజు వెంకటలక్ష్మణరావు
   సి) కాళోజీ నారాయణరావు　డి) అడవి బాపిరాజు
4. **1905లో ఆంధ్ర సంవర్ధినీ నిలయం అనే గ్రంథాలయాన్ని ఎక్కడ స్థాపించారు?**
   ఎ) సికింద్రాబాద్　బి) హైదరాబాద్
   సి) వరంగల్　డి) రాజమండ్రి
5. **కొమర్రాజు వెంకట లక్ష్మణ రావు 'విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి' అనే ప్రచురణ సంస్థను ప్రారంభించిన సంవత్సరం?**
   ఎ) 1906　బి) 1900
   సి) 1903　డి) 1905
6. **నిజాం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రాజకీయ సంస్కరణల కమిషన్'కు అధ్యక్షుడు?**
   ఎ) అరవ ముద అయ్యంగార్
   బి) కె. రంగదాసు　సి) వట్టికోట ఆళ్వారుస్వామి
   డి) సురవరం ప్రతాపరెడ్డి
7. **'దేశోద్ధారక గ్రంథ మాలను' స్థాపించింది ఎవరు?**
   ఎ) సురవరం ప్రతాపరెడ్డి　బి) ముట్నూరి కృష్ణారావు
   సి) వట్టికోట ఆళ్వారు స్వామి　డి) అడవి బాపిరాజు

| జవాబులు | 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
|---|---|---|---|---|---|---|---|
| | C | D | B | A | A | A | C |

SAKSHI